# భక్తులనుండి భగవంతుడు ఆశించేది హృదయ పవిత్రత

విశ్వమందు విభుడు వెలుగొందుచుండును
విభునియందు విశ్వము వెలుగుచుండు
విశ్వ విభుల మైత్రి విడదీయరానిది
వినుడు భారతీయ వీర సుతుడ!

ప్రేమస్వరూపులారా! పవిత్రమైన, దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన ఈ ఓణం పర్వదినమున కేరళ ప్రజలు తెల్లవారుఝామున లేచి అభ్యంగన స్నానమాచరించి, నూతన వస్త్రములు ధరిస్తారు. భగవన్నామ స్మరణ గావించుకుంటూ, దేవాలయాలను సందర్శిస్తూ, పవిత్రమైన కర్మల నాచరిస్తూ ఈ ఓణం పండుగను భక్తి, శ్రద్ధలతో జరుపుకుంటారు. కొందరు రామాయణమును పారాయణం చేస్తుంటారు.

**వామనమూర్తి - బలి చక్రవర్తి**

పూర్వం కేరళ రాజ్యమును పరిపాలించిన బలి చక్రవర్తి ప్రజలను కన్నబిడ్డల వలె ప్రేమిస్తూ, వారికి సేవలు చేస్తూ వచ్చాడు. ప్రజలుకూడా బలిచక్రవర్తిని ఎంతో ప్రేమిస్తూ, ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకొని తమ జీవనం సాగిస్తూ వచ్చారు. బలిచక్రవర్తి అనేక యజ్ఞయాగాది క్రతువులను ఆచరిస్తూ వచ్చాడు. ఒక పర్యాయము అతనొక గొప్ప యజ్ఞమును తలపెట్టి, ఆ సందర్భమున ప్రజలకొక వాగ్దానం చేశాడు, "ఎవరేది కోరితే వారికది నేను తప్పక అందిస్తాను", అని. ఇది విన్నటువంటి విష్ణుమూర్తి వామనరూపుడై యాగశాల కేతెంచాడు. కొబ్బరాకుల గొడుగు చేతపట్టుకొని చిన్న పిల్లవాని రూపంలో

sri sathyasai vachanamrutam

యాగశాలలో ప్రవేశిస్తున్న విష్ణుమూర్తి తేజస్సును, దివ్యకాంతిని, ప్రకాశమును చూసి బలిచక్రవర్తి కుమార్తెయైన రత్నమాల ఆశ్చర్యచకితురాలై, "ఆహా! ఎవరీ దివ్యతేజోమూర్తి? ఇంతటి గొప్ప కాంతి కలిగిన బాలుడు నా కుమారుడుగా పుట్టి వుంటే ఎంత బాగుండును!" అని అనుకుంది. ఈవిధంగా ఎవరికి వారు అతని దివ్య తేజస్సును మంత్రముగ్ధులై తిలకించుచుండగా వామనమూర్తి యాగశాలలో ప్రవేశించాడు. బలిచక్రవర్తి లేచి అతనికి ఘనంగా స్వాగతం పలికి, ఉచితాసనంలో ఆసీనుని గావించి, "మీరెందుకోసం వచ్చారు? నానుండి దేనిని ఆశించి వచ్చారు?" అని అడిగాడు. "అయ్యా, బలిచక్రవర్తీ! నాకు మూడడుగుల నేల ఇస్తే చాలు. ఇంకేమీ అక్కరలేదు" అన్నాడు, వామనమూర్తి. "ఇంతేనా! సరే, తీసుకోండి", అన్నాడు బలిచక్రవర్తి. వామనుడు ఒక అడుగుతో ఆకాశమంతటినీ ఆక్రమించాడు. రెండవ అడుగు వేసేటప్పటికి అతని పాదము భూమి అంతటా నిండిపోయింది. "మూడవ అడుగు ఎక్కడ వేయాలి?" అని అడిగాడు. అప్పుడు బలిచక్రవర్తి, "స్వామీ! మీరడిగినది మూడడుగుల నేల. కాని, రెండడుగులతో భూమ్యాకాశాలను రెండింటినీ ఆక్రమించారు. ఇంక, మూడవ అడుగుకు సరిపడేంత స్థలము నేనెక్కడి నుండి తెచ్చేది! ఆ మూడవ అడుగు నా తలపై పెట్టండి", అని ప్రార్థించాడు. అప్పుడు వామనుడు అతని తలపై తన పాదం పెట్టి అతనిని పాతాళానికి పంపించాడు. "అతను పాతాళలోకానికి ఎట్లా పోయాడు?" అని మీరు అనుకోవచ్చును. మొదటి రెండు అడుగులు అంత పెద్దవిగా, అంత బలమైనవిగా ఉన్నప్పుడు మూడవ అడుగుకూడా అదేవిధంగా ఉంటుంది కదా! వామనమూర్తి తన తలపై పాదం పెట్టేటప్పటికి బలి పాతాళానికి దిగిపోయాడు. ఇంతే గాకుండా, దీనికి మరొక కారణం కూడా లేకపోలేదు. బలిచక్రవర్తి చాలా గొప్పవాడే, వినయ విధేయతలు గలవాడే, మహాభక్తుడే! కాని, అతనిలో కొంత అహంకారం ఉండినది. భగవంతుడు దేనినైనా సహిస్తాడుగాని క్రోధము, అహంకారము ఈ రెండూ ఉన్నటువంటివానిని మెచ్చుకోడు.

**'విలువలేని పెట్టెలో విలువైన నగలు పెట్టినట్లు...'**

అహంకారము అనేక దుర్గుణాలకు కారణమవుతుంది. ఏమిటీ అహంకారము! ఏమి

sri sathyasai vahini / srisathyasaivachanamrutam

చూసుకొని నీవు అహంకారపడుతున్నావు? దేహ సౌందర్యమా? ఇంద్రియపటుత్వమా? బుద్ధిబలమా? ఆస్తిపాస్తులా? ఇవేవీ శాశ్వతం కావు. భగవంతుడు ప్రతి మానవునికి సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే అత్యంత పవిత్రమైన అయిదు గుణముల నిచ్చాడు. వీటిని నీవు అభివృద్ధిపరచుకో. ఇవే మానవుని పంచప్రాణములు. క్రోధము, అసూయ, ద్వేషము ఇత్యాది పశులక్షణాలు కలిగినవాడు మానవుడెట్లవుతాడు! మానవుడనగా సద్గుణములతో కూడినవాడు అని అర్థం. నీవు సత్యాన్ని అనుసరించు. Truth is God (సత్యమే దైవం). ప్రేమను సాధించు. Love is God. Live in love (ప్రేమయే దైవం. ప్రేమలో జీవించు). నీలోనే ఉన్నటువంటి పవిత్రమైన గుణములను నీవు ఆవిర్భవింపజేసుకోవడంలేదు. అంతర్ముఖంగా ఉన్న సద్గుణాలను వదలిపెట్టి బహిర్ముఖమైన విషయాలను నీవు అనుసరిస్తున్నావు. పెట్టె చూస్తే అది ఇనుపపెట్టె. కాని, లోపల ఉన్నటువంటివి విలువైన వజ్రాలు. నీవు విలువనిచ్చేది పెట్టెలో ఉన్నటువంటి నగలకేగాని, పెట్టెకు కాదు. ఈ దేహము కూడా ఒక ఇనుపపెట్టెవంటిది. ఇందులో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే విలువైన నగలున్నాయి. పాంచభౌతికమైన ఈ దేహము ఏదో ఒకనాటికి అంత్యమయ్యేదే!

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎఱుక లేదు**
**శత వర్షముల దాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదా మాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో కాక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్న యపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్త్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీ సాయి మాట**

sri sathyasaivaharamrutam

తుమ్మినంతలో తూలిపోవు తొమ్మిది చిల్లుల తోలు బొమ్మ ఇది. ఇటువంటి అస్థిరమైన దేహాన్ని నమ్ముకొని, దీని లోపలనున్న విలువైన నగలను విస్మరిస్తున్నావు. కనుకనే, అశాంతికి గురి అవుతున్నావు. ఒక కోటీశ్వరునిదగ్గరకు వెళ్ళి, 'అయ్యా! నీకు అన్నీ వున్నాయి కదా! మరి శాంతి ఉందా?' అని అడుగు. 'నాకు అన్నీ ఉన్నాయిగాని, శాంతి లేదు', అంటాడు. బయట ఎక్కడ చూసినా 'పీసెస్' (Pieces) ఉన్నాయికాని, 'పీస్' (Peace) లేదు. శాంతి నీలోనే ఉన్నది. కాబట్టి, నీలోనే నీవు వెతుక్కో. అదే నీ కర్తవ్యం. దానిని విస్మరించి అల్పమైన, తుచ్ఛమైన కోరికలను నీవు కోరుతున్నావు. నీలోనే ఉన్న పవిత్రమైన గుణములను నీవు సాధించినప్పుడు నిత్య సత్యమైన శాంతిని అనుభవించగలవు.

**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చిన విలువ సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**దాన ధర్మాల సార్థకత సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**పదవుల నేలిన ఫలము సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**బహుళ సత్కార్య లాభంబు సున్న**
**ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ**
**గుణము లియ్యవి నాల్గు పునాది గోడలప్ప**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

సత్య, ధర్మ, ప్రేమ, శాంతులే మనకు నిజమైన, శాశ్వత మైనటువంటి ఆస్తి. కేరళలో ప్రజలు ఇట్టి పవిత్రమైన గుణములు కలిగి దైవాన్ని ఆరాధిస్తూ వచ్చారు. బలి చక్రవర్తిని వామనమూర్తి పాతాళానికి త్రొక్కడంలో అంతరార్థమేమిటి? అతనియందున్న అహంకారాన్ని త్రొక్కివేశాడు. ఈ సత్యాన్ని గుర్తించి ప్రజలందరూ కన్నులు తెరిచి

srisathyasaivachanamrutam

అహంకారాన్ని విడిచిపెట్టారు. అందుచేతనే ఇప్పటికికూడను కేరళ చాలా ప్రశాంతమైన, పవిత్రమైన, పచ్చదనంతో కళకళలాడే ప్రదేశంగా పేరు తెచ్చుకుంది. వామనమూర్తి బలిని పాతాళానికి పంపినప్పుడు ప్రజలు, "అయ్యో, మా చక్రవర్తి మాకు దూరమైనాడే! ఇక మాకెవరు దిక్కు?" అని చాలా బాధపడ్డారు. అప్పుడాయన, "ప్రతి సంవత్సరము ఇదే రోజున వచ్చి నేను మిమ్మల్ని చూసి వెళతాను", అని వాగ్దానం చేశాడు. అదియే ఈ ఓణం. ఈరోజున తాను వచ్చి అందరినీ ఆశీర్వదించి వెళుతుంటాడు.

**'కమ్యూనిస్టు' కాదు, 'కమ్-యు-నెక్స్ట్'**

ప్రతి మానవునికి ఏవో కొన్ని చింతలుంటాయి. అయితే, కేరళ ప్రజలకు లౌకికమైన వాంఛలు తక్కువ. అందుచేత, వారికి ఎక్కువ చింతలు లేవు. ఒకరితో ఒకరు అన్యోన్యంగా, అనుకూలంగా మెలగుతుంటారు. మధ్యమధ్య ఏవో కొన్ని భేదాలు కలుగవచ్చు. కాని, అవన్నీ కదిలిపోయే మేఘాలు. నిజంగా కేరళ ప్రజలు నిర్మల, నిశ్చల, నిస్స్వార్థ హృదయులు. వాళ్ళను ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలి. వాళ్లకు ఎన్ని పనులున్నప్పటికీ ప్రొద్దున్న, సాయంకాలము విభూతి పెట్టుకొనక, దేవాలయాలను సందర్శించక ఉండలేరు. ఇట్టి పరిస్థితులయందుకూడను కేరళ రాష్ట్రమును కమ్యూనిస్టు రాష్ట్రమంటారు. 'కమ్యూనిస్టు' కాదు; 'కమ్-యు-నెక్స్ట్' (Come-you-next)! వాళ్లలో ఉన్న పవిత్రమైన భావములే వాళ్లను దైవానికి దగ్గరగా చేర్చుతున్నాయి. ఈ ఓణం పండుగనాడు వాళ్ళు దేవాలయాలకు వెళ్ళి పూజలు చేస్తుంటారు. ప్రత్యేకించి బాలకృష్ణుని మందిరానికి అధికసంఖ్యలో వెళుతుంటారు. భక్తిపాటలు పాడుకుంటూ ఆనందాన్ని అనుభవిస్తుంటారు. అయితే, ఈ ఆధునిక యుగ ప్రభావంచేత చాలామందిలో కొంతవరకు మార్పు వచ్చింది. కాని, పూర్వం వాళ్ళెప్పుడుకూడను నిశ్చల, నిర్మల హృదయులై ఉండేవారు. అందరికీ మంచి జరగాలని కోరుకునేవారు. భగవంతునికి ఇష్టం లేని కోరికలు వాళ్లు ఏమాత్రము కోరుకునేవారు కాదు. "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అన్న విశాలమైన భావాన్ని కలిగియున్నటువంటి కేరళ ప్రజలు నిజంగా చాలా ఉత్తములు.

srisathyasaivachanamrutam

**సత్సంగంలో చేరి సత్శీలాన్ని పోషించుకోండి!**

విద్యార్థులారా! మంచితనము ఎప్పటికీ మంచి ఫలితాలనే ఇస్తుంది. "మనస్సుకు మనస్సు సాక్షి. దేహానికి గుణము సాక్షి. మూఢునకు మూర్ఖం సాక్షి." మనము మూర్ఖంగా ప్రవర్తించకూడదు. వివేకంతో విచారణ చేయాలి. అది కేవలం వ్యక్తిగతమైన విచారణ కాకుండా సామాజికపరమైన విచారణగా ఉండాలి. మూర్ఖంగా ప్రవర్తిస్తే అపకీర్తి పాలవుతాము. చక్కగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోండి. కేవలం చదువులోనే కాకుండా నడతలోకూడా మంచితనం ఉట్టిపడాలి. Character is real life. Character is real education (సత్శీలమే నిజమైన జీవితం. సత్శీలమే నిజమైన విద్య). పిల్లలు ఒకరిని చూసి ఒకరు ఏదో ఊహించుకొని, ఒకరి నొకరు అనుకరించడానికి ప్రయత్నిస్తుంటారు. ఈవిధంగా అనుకరించడం చాలా చెడ్డ గుణం. Tell me your company, I shall tell you what you are (నీ స్నేహితులెవరో చెప్పు. నీవు ఎలాంటివాడవో నేను చెబుతాను). కాబట్టి, సత్శీలాన్ని పోషించుకొనే నిమిత్తం సత్సంగంలో ప్రవేశించండి. సత్సంగంలో చేరినప్పుడే మీరు మంచివారుగా తయారు కాగలరు. మంచితనమును మనము ఎక్కడి నుండో కొనితెచ్చుకోవలసిన పనిలేదు. అది మన యందే ఉన్నది. దానిని మనం అభివృద్ధిపరచుకోవాలి. ఒక చిన్న మొక్క పెద్ద వృక్షముగా పెరగడానికి మనం ఎంత ప్రయత్నం చేయాలో మనలో ఉన్నటువంటి మంచిని పెంచుకునే నిమిత్తం అంత ప్రయత్నం చేయాలి. మీ తల్లిదండ్రులకు, మీ సమాజానికి, మీ దేశానికి మీరు మంచిపేరు తెప్పించాలి. మన దేశానికి 'హిందూ (HINDU) దేశమ'ని పేరు.

H - Humility (వినయ విధేయతలు)
I - Individuality (వ్యక్తిత్వము)
N - Nationality (జాతీయాభిమానము)
D - Devotion (దైవభక్తి)
U - Unity (ఐకమత్యము)

ఈ ఐదక్షరములకు తగినట్లుగా మన నడతను తీర్చిదిద్దుకున్నప్పుడే మనము నిజంగా

srisathyasaivachanamrutam

మానవులమవుతాము. మానవాకారాన్ని ధరించి పశువులవలె ప్రవర్తించడం పొరపాటు. నీలో ఏవైనా పశుగుణాలు తలెత్తితే, "నేను పశువును కాను. నేను మనిషిని", అని నిన్ను నీవు హెచ్చరించుకోవాలి. నీవు మానవుడవు. కాబట్టి, మానవతా విలువలను పోషించుకోవాలి. ఈనాటి మానవునిలో మానవతా విలువలే లేకుండా పోతున్నాయి; పశులక్షణాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడికి పోయినా, ఎవరిని చూసినా అందరూ ఆశించేది ఒక్కటే – డబ్బు! డబ్బు! డబ్బు! అంతా డబ్బుతోనే ముడిపడివుంది. ఏమిటీ డబ్బు! Money comes and goes but morality comes and grows (డబ్బు వస్తుంది, పోతుంది. కాని, నైతిక శక్తి వస్తే పోయేది కాదు; పైగా అది అభివృద్ధి చెందుతుంది కూడా). కాబట్టి, నైతిక విలువలను పోషించుకోవాలి. అప్పుడే మనం నిజమైన మానవులుగా తయారౌతాము. ఈవిధంగా మనము మంచితనాన్ని అలవర్చుకొని, మంచిగా జీవించి, సమాజంలో good name (మంచిపేరు) సంపాదించుకోవాలి. Good name ను సంపాదించుకోవడంతోపాటు నిరంతరము 'God Name' (భగవన్నామాన్ని) స్మరిస్తూ వుండాలి.

**పవిత్రతను చేకూర్చే సాధన భగవత్ప్రార్థన**

మొట్టమొదట మనం తీసుకునే 'ఫుడ్' (ఆహారం) సరియైనదిగా ఉండేటట్లు చూసుకోవాలి. 'ఫుడ్' మంచిగా ఉంటే మన 'హెడ్' (మతి) మంచిగా ఉంటుంది. 'హెడ్' మంచిగా ఉన్నప్పుడే మనకు 'గాడ్' (మాధవుడు) సాక్షాత్కరిస్తాడు. మనం తీసుకునే ఆహారం సాత్వికమైనదిగా ఉన్నప్పుడే మనకు భగవంతుని పొందడానికి వీలవుతుంది. ఈనాడు ఎక్కడ చూసినా 'పొల్యూషన్' (కాలుష్యం) పెరిగి పోయింది. మనము పీల్చే గాలి, త్రాగే నీరు, తినే తిండి, చేసే పనులు అన్నీ కలుషితమైపోయినాయి. వీటిని మనం పరిశుద్ధం చేసుకోవడానికి చేయవలసిన సాధన ఒక్కటే. అదే భగవత్ప్రార్థన. కాలుష్యాన్ని నిర్మూలించుకొని మన హృదయాన్ని పవిత్రం గావించుకున్నప్పుడే మనం నిజమైన మానవులమవుతాము. 'ప్యూరిటీ'ని సాధించినప్పుడే 'డివినిటీ' మనకు లభిస్తుంది. 'యూనిటీ' ఉన్నచోటే 'ప్యూరిటీ' ఉంటుంది. కాబట్టి 'యూనిటీ', 'ప్యూరిటీ', 'డివినిటీ' ఈ మూడింటి మధ్యగల సన్నిహిత సంబంధమును మీరు మనస్సులో పెట్టుకోవాలి. ఈవిధమైన

sri sathyasai vahini amrutam

పవిత్ర భావములు మనయందు ఆవిర్భవించినప్పుడే మన భారతదేశము బాగుపడుతుంది. ప్రాచీనకాలమునుండి పుణ్యభూమి, త్యాగభూమి, యోగభూమిగా పేరుగాంచిన మన భారతదేశము ఈనాడు భోగభూమిగా మారిపోతున్నది.

**పిచ్చిపిచ్చి కోరికలను దూరం చేసుకోండి**

మనకు ముఖ్యంగా కావలసింది త్యాగము. త్యాగమంటే ఏమిటి? ఇల్లూ వాకిళ్లనూ, ఆలుబిడ్డలనూ వదలిపెట్టి అడవికి వెళ్లడం కాదు. నీ కోరికలనుండి వచ్చినటువంటి ఫలితాన్ని నీవు త్యాగం చేయాలి. అదే నిజమైన త్యాగము. పిచ్చిపిచ్చి కోరికలను మనము దూరము చేసుకోవాలి. అప్పుడే మన హృదయము తెల్లటి వస్త్రంగా తయారవుతుంది. అటువంటి పరిశుద్ధమైన, పవిత్రమైన హృదయాన్నే భగవంతుడు ఇష్టపడతాడు. భగవంతుడు మీనుండి దేనినీ ఆశించడు. ఆయనకు ఎట్టి ఆశలూ లేవు. ఆశలున్నది మీకే! మీ కోరికలను మీరు మంచిగా మార్చుకుంటే భగవంతుడు ఎంతో ఆనందిస్తాడు. అప్పుడే మీ మనస్సుకు, మీ కుటుంబానికి, మీ సమాజానికి, మీ దేశానికికూడా శాంతి, సౌఖ్యములు కలుగుతాయి. మొట్టమొదట మనం మన కుటుంబంలో శాంతిని నెలకొల్పుకోవాలి. తరువాత దానిని సమాజానికి ప్రసరింపజేయాలి. సమాజము బాగుపడినప్పుడే దేశము బాగుపడుతుంది. దేశానికి శాంతి కావాలంటే మొట్టమొదట వ్యక్తిస్థాయిలో శాంతి ఏర్పడాలి. వ్యక్తిలో శాంతి ఉన్నప్పుడే ప్రపంచంలో శాంతి సాధ్య పడుతుంది. వ్యక్తిలోనే శాంతి లేనప్పుడు ప్రపంచంలో శాంతి ఎలా ఉంటుంది!

**నవ్వుతూ నవ్విస్తూ మీ జీవితాన్ని గడపాలి**

విద్యార్థులారా! విద్యార్థినులారా! మీరు దేశముయొక్క శాంతిని కోరండి. మన భారతదేశము ఎంతో గొప్పది; ప్రాచీన కాలమునుండికూడను శాంతికోసం పాటుపడుతూ వచ్చింది. కాని, ఈనాడు పాశ్చాత్య నాగరితా వ్యామోహము ఆవరించడంచేత స్వమత విజ్ఞానము సన్నగిల్లి, 'పీస్' (శాంతి) అనేది కాస్తా 'పీసెస్' (ముక్కలు) అయిపోయింది. మనయందున్న 'పీస్'ను మనము 'పీసెస్'గా మార్చుకోకూడదు. మన సంస్కృతిని విస్మరించకూడదు. హృదయంలో శాంతిని నింపుకోవాలి. నిరంతరం ఆనందంగా ఉండాలి.

srisathyasaivachanamrutam

మీ పెదవులపై చిరునవ్వులు చిందులు వేయాలి. మిమ్మల్ని చూసినప్పుడు ఎదుటి వ్యక్తికి కూడా ఎంతో ఆనందం కలగాలి. నవ్వుతూ నవ్విస్తూ మీ జీవితాన్ని గడపాలి. మనం ఆనందంగా ఉంటూ ఇతరులకు ఆనందం పంచాలి. ఈవిధమైన సద్గుణములతో తమ జీవితాన్ని గడుపుతూ వచ్చారు, ఆనాటి భారతీయులు. ఈనాడు కూడా అటువంటివారికి తక్కువేమీ లేదు. ఆర్థిక పరిస్థితిలో కాస్త వెనుకబడి ఉన్నారుకాని, హృదయం మాత్రం చాలా విశాలంగానే ఉన్నది. హృదయాన్ని విశాలం గావించుకున్నప్పుడు మనం ఎంతటి ఘన కార్యమునైనా సాధించవచ్చును.

ఈ ఓణం పండుగ మనం హృదయాన్ని విశాలం గావించుకునే నిమిత్తమై ఏర్పడినటువంటిదనే సత్యాన్ని మీరందరూ గుర్తించాలి. వ్యక్తి స్థాయిలో, కుటుంబ స్థాయిలో మనము ఆనందాన్ని అనుభవించి, ఆ ఆనందాన్ని సమాజానికి పంచాలి. అప్పుడు అందరు కూడను ఆనందంగా ఉంటారు. 'హేపీనెస్ ఈజ్ యూనియన్ విత్ గాడ్' (భగవంతునితో తాదాత్మ్యం చెందడమే ఆనందము). అట్టి ఆనందాన్ని మీరు అనుభవించండి. ప్రేమతో ఒకరికొకరు ఉత్సాహ ప్రోత్సాహముల నందించుకుంటూ అందరూ కలసిమెలసి ఉండండి. ఒకరి నొకరు ప్రేమతో 'హలో హలో...' అని పలుకరించుకుంటూ మీరందరూ ఏకం కావాలేగాని, 'గుడ్‌బై' చెప్పి ఒకరినుండి ఒకరు విడిపోకూడదు. ఆవిధంగా 'గుడ్‌బై' చెప్పడం తప్పు; నీవు పవిత్రతను పోషించుకొని 'గుడ్ బాయ్'గా రూపొందాలి.

**(తేదీ 5.9.2006, ఓణం పర్వదినం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam